
ప్రజాశక్తి
సోమవారం 17 ఫిబ్రవరి 2025
5
పార్వతీపురం మన్యం



కాంప్లెక్స్ సమావేశాలు 4 గంటల వరకే నిర్వహించాలి : యుటిఎఫ్

వీరఘట్టం : క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను సాయంత్రం నాలుగు గంటల వరకే నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు మెడికల్ లీవ్ తప్ప ఎటువంటి సెలవులు మంజూరు చేయమని ప్రకటించడం బాధ్యతారహిత చర్యని అన్నారు. ఉదయం పాఠశాలకు హాజరై మధ్యాహ్నం భోజనం అనంతరం సుదూరంలో ఉన్న క్లస్టర్ పాఠశాలకు చేరుకొని సాయంత్రం 5 గంటల వరకు సమావేశంలో పాల్గొని, 6గంటల వరకు ఫేషియల్ హాజరు పనిచేయకపోవడం మహిళా, సీనియార్టీ ఉపాధ్యాయులు దూర ప్రాంతాల నుంచి హాజరైన ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కావున కాంప్లెక్స్ సమావేశాలు ఉసాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తే ఎజెండాలో అంశాలను పూర్తిస్థాయిలో చర్చించడానికి అవకాశం ఉంటుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దూకుడుతో యంత్రాంగం తీరులో మార్పు వచ్చేనా?

- అధికారుల్లో గుబులు రేపుతున్న కలెక్టర్ చర్యలు
- పనితీరు మార్చుకోకపోతే వేటు తప్పదనే హెచ్చరిక



ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దూకుడు పెంచారు. ఎన్నిసార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి పనితీరు మార్చుకోవాలని హెచ్చరిస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించకపోవడంతో ఆయన కొరడా ఝుళిపించారు. జిల్లా కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై ఎక్కువ గా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. తరచూ మండల, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయన దూకుడు పెంచి చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ప్రధానంగా రెవిన్యూ శాఖలో సమస్యల పరిష్కారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. మండల, డివిజన్ స్థాయి రెవిన్యూ అధికారుల తో ఆయన సమీక్ష సమావేశాలు నిర్వహించి తగు సూచనలు చేస్తున్నా కిందస్థాయి లో సమస్యల పరిష్కారం కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం రెవిన్యూ శాఖలో గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యం ఎక్కువగా వుంటోంది. గ్రామ స్థాయిలో భూసమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. సంవత్సరాలు గడుస్తున్నా ఆ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ముఖ్యంగా గత ప్రభుత్వం హయాంలో నిర్వహించిన సమగ్ర సర్వే వల్ల సమస్యలు రెట్టింపయ్యాయి. రైతుల సాగులో ఉన్న భూమి విస్తీర్ణం కన్నా తక్కువ చూపడం, ఒకరి సర్వే నెంబర్లు ఇంకొకరి పేరున వన్ బి ఖాతాల్లో కనిపించడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిదినెలలైంది. ఈ ప్రభుత్వం కూడా భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు, గ్రామసభలు నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా వేలాది సమస్యలు అర్జీల రూపం లో అధికారులకు చేరాయి. రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యల పరిష్కారానికి రీ సర్వే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే గ్రామస్థాయిలో రీ సర్వే కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. గ్రామస్థాయిలో తగిన సిబ్బంది లేకనో, మరే ఇతర కారణాల వల్ల నో రీ సర్వే కార్యక్రమం ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో జరగడం లేదు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే రాళ్ళపై మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఫొటోలు తొలగించే పనులను ప్రస్తుత ప్రభుత్వం చేపడుతోంది. కానీ రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం పై దష్టి సారించడం లేదు. గత ప్రభుత్వంలో మాదిరిగానే సర్వే జరగని గ్రామాల్లో నూ సర్వే చేసినట్లు నివేదికలు పంపిన విధంగా ఇప్పుడు కూడా అధికారులు రీసర్వే కార్యక్రమాన్ని మొక్కుబడిగా భావిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ జిల్లాలో ఇద్దరు విఆర్వోలను సస్పెండ్ చేశారు. సాలూరు, సీతానగరం మండలాలకు చెందిన ఇద్దరు విఆర్‌ఒలపై పనితీరులో నిర్లక్ష్యం కారణంగా వేటు వేశారు. ప్రణాళికాబద్ధంగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి వున్నా ఆ విధంగా పని జరగడం లేదు. దీనికి ప్రధాన కారణం రెవిన్యూ శాఖలో వేళ్ళూనుకుపోయిన అవినీతి. లంచం లేనిదే రెవిన్యూ శాఖలో ఏ పని కూడా జరిగే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కింద స్థాయి రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవడం ద్వారా మిగిలిన అధికారులకు హెచ్చరిక సంకేతాలు పంపారు.

అభివద్ధి పనుల విషయంలోనూ..

జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జాతీయ ఉపాధి హామీ కింద జరుగుతున్న పనుల్లో ఎక్కువగా సిసి రోడ్లు, కాలువలు, బిటి రోడ్డు నిర్మాణాలు వున్నాయి. ఈ పనులు జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో చురుగ్గా జరుగుతున్నాయి. అయితే గిరిజన నియోజకవర్గమైన కురుపాంలో పనులు నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో అనేక సమీక్ష సమావేశాల్లో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను హెచ్చరించారు.పనులు వేగవంతం చేయాలని ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో ఆయన చర్యలకు ఉపక్రమించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో పల్లెపండగ పనులు నత్తనడకన జరుగుతున్న తీరుపై కలెక్టర్ కొరడా ఝుళిపించారు. మార్చిలోగా ఈ పనులు పూర్తి చేయాలని, లేకపోతే నిధులు వెనక్కి పోతాయని చెపుతున్నా చలనం లేదు. దీంతో ఆయన పనులు ప్రారంభం కాని మండలాల ఇంజినీర్లను సస్పెండ్ చేయాలని తొలుత ఆదేశించారు. తర్వాత షోకాజ్ నోటీసులు జారీకి పరిమితమయ్యారు. పల్లె పండగ పనులు వేగవంతం కావాలంటే స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి కింద స్థాయి నాయకులతో చేయించాలి. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో పనులు వేగంగా జరుగుతున్నా కురుపాం నియోజకవర్గంలో నెమ్మదిగా జరుగుతుండడంపై కలెక్టర్ కొరడా ఝుళిపించారు. నిర్లక్ష్యం నిద్రలో ఉన్న జిల్లా యంత్రాంగంలో మార్పు తీసుకురావడానికి కలెక్టర్ దూకుడు ఏ మేరకు పని చేస్తుందో వేచి చూడాల్సిందే.

రియల్ మోసం

- పదేళ్లుగా లబ్ధిదారులకు చూపని స్థలాలు
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి - పాలకొండ

చౌకగా ఇంటి స్థలాలు ఇస్తామని కొంతమంది వ్యాపారులు రియల్ ఎస్టేట్ ముసుగులో కోట్లాది రూపాయలను కాజేసిన వైనం ఆలస్యంగా బయటకు వచ్చింది. పదేళ్ల నుంచి ఒక్కరికి కూడా స్థలం అప్పజెప్పకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పాలకొండ మండలాన్ని వ్యాపార కేంద్రంగా చేసుకొని కొంతమంది వ్యాపారులు దుర్గా ప్రసన్న రియల్ ఎస్టేట్ పేరిట ఒక కార్యాలయం తెరిచారు. పాలకొండ పట్టణానికి పక్కనే ఉన్న శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలో తుడ్డలి గ్రామం వద్ద పదిఎకరాల స్థలంలో రియల్ ఎస్టేట్ వెంచర్ వేస్తున్నామని ప్రకటించారు. ఇందుకు గానూ రూ.600 చొప్పున 66 నెలలతో స్కీమ్ పెట్టారు. ఇందులో సుమారు వెయ్యి మంది వరకు చేరారు. ప్రతినెలా డబ్బులు అయితే వసూలు చేస్తున్నారు కానీ ఈ స్కీంలో చేరిన ఒక్కరికి కూడా కనీసం బిట్ ఇవ్వకుండా అదుగో ఇదుగో అంటూ కాలయాపం చేశారు. నేటికి సుమారు పదేళ్లు కావస్తున్నా లేవుట్ వేస్తామన్న భూమిలో పనులేమీ కాలేదు. ఇప్పటికీ ఈ భూమిలో వ్యవసాయమే సాగువుతుంది. లేఅవుట్ వేసి రోడ్లు, కాలువలు నిర్మించలేదు. అలాగే ఒక విద్యుత్ స్తంభాలు కూడా కూడా లేదు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలపై పట్టణ వాసులు గుర్రంటున్నారు. ఈ లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవు. పది ఎకరాలు భూమికి నాలా మాత్రమే చెల్లించారు, వుడా అప్రోలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అనుమతులు కూడా పొందలేదు. స్థలంలో ఆ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాల్సి కూడా ఉండగా, అదీ లేదు. ఇంత ఘరానా మోసం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు దర్జాగా తిరుగుతుండడంతో ప్రతి ఒక్కరు ముక్కున వేలేసుకుంటున్నారు.



లేఅవుట్ వేస్తామన్న పంట పొలాలు

స్థలం ఎక్కడుందో చూపించలేదు

దుర్గా ప్రసన్న రియల్ ఎస్టేట్లో 66 నెలవారీ వాయిదాలు పూర్తిగా చెల్లించాను. నేటికీ పదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు తమకు స్థలం ఎక్కడ ఉందో కూడా చూపించలేదు. సభ్యులుగా చేర్పించే ముందు బూర్జు మండలం తుడ్డలి గ్రామం దగ్గర స్థలం చూపించారు. అయితే అవన్నీ పంట పొలాలు గానే ఉన్నాయి. దారుణంగా మోసపోయాం.

డి వెంకట రమణ రాజు,
బాధితుడు, పాలకొండ.

స్థలం ఇవ్వలేదు

పైసా పైసా పోగుచేసి నెల వారీ 66 నెలలు వాయిదాల రూపంలో దుర్గాప్రసన్న రియల్ ఎస్టేట్లో డబ్బులు కట్టాం. ఇంత వరకు స్థలం చూపించలేదు. రిజిస్ట్రేషన్ కూడా చేయలేదు.

దుప్పాడ పాపి నాయుడు,
బాధితుడు, పాలకొండ.

నేడు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక సోమవారం ఆ కార్యాలయంలో జరగనుంది. ఇదివరకే చైర్మన్ పదవి కోసం రెండుసార్లు ఎన్నిక జరగ్గా వివిధ కారణాల రీత్యా వాయిదా పడింది. దీంతో సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మూడోసారి సోమవారం ఎన్నిక జరగనుంది.



ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

విద్యార్థులు ఇష్టంతో చదవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు ఇష్టంతో చదవాలని, కష్టంతో కాదని, ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రతి ఏడాది వలే ఈ ఏడాదీ పదో తరగతి ఉత్తీర్ణత శాతంలో రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను కలెక్టర్ కోరారు. మై స్కూల్ -మై ప్రైడ్ పై హెచ్ఎం, టీచర్స్‌తో కలెక్టర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠ్యాంశాలపై ప్రతి విద్యార్థి సంపూర్ణ విజ్ఞానం కలిగి ఉండాలని, ఆ విధంగా చేయడమే మై స్కూల్ - మై ప్రైడ్ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పదో తరగతి చదివే విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడం కోసం దీన్ని రూపొందించామన్నారు. పదవ తరగతికే పరిమితం కాకుండా మై స్కూలు-మై ప్రైడ్ ప్లస్‌గా రూపొందించి అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలలో సంపూర్ణ విజ్ఞానం కలిగేలా తీర్చిదిద్దడం, ఆటలు, వ్యాస రచనలు, చర్చలు, సైన్స్ ఫేర్లలో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సబ్జెక్టుల వారీగా ఎక్కడా టీచర్ల కొరత లేకుండా సర్దుబాటు చేయడం జరిగిందని, విద్యార్థులకు బోధన విషయంలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు పదో తరగతే పునాది అని, కావున విద్యార్థులు సబ్జెక్టులపై పూర్తి అవగాహన చేసుకొని, సందేహాలను నివృత్తి చేయాలని అన్నారు. ప్రతి రోజూ నేర్చుకున్న పాఠ్యంశాలపై విద్యార్థులు పరీక్షలు రాయడం వల్ల, తాము నేర్చుకున్న చదువుపై పట్టు లభిస్తుందని తెలిపారు. అలాగే వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. తొలుత పాఠ్యంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు అడిగి తెలుసుకోవాలని, పదో తరగతి చదువు అనంతరం ఉపాధి అవకాశాలు లభించే కోర్సులపై అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో ఉప, మండల విద్యాశాఖాధికారులు, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడికి జర్నలిస్టు సంఘాల ఖండన

టిడిపి మక్కువ మండల అధ్యక్షుడిని అరెస్టు చేయాలంటూ నేడు ఉమ్మడి జిల్లాల్లో ఆందోళనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టిడిపి నాయకుల దాడిని పలు జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దాడికి పాల్పడిన మక్కువ మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీనాయుడు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి పిఎస్ఎస్‌వి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు అల్లు సూరిబాబు, జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అవనాపు సత్యనారాయణ, తెలుగు జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు ఎంఎంఎల్ నాయుడు, విజయనగరం జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడమంటే భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని, ఇటువంటి చర్యలను తాము సహించబోమని తెలిపారు. రామారావుకు, ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని, బెదిరింపు చర్యలకు పాల్పడిన వేణుగోపాలనాయుడు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కూడా రామారావుకు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. విలేకరికిపై దాడి చేసిన మండల టిడిపి అధ్యక్షులు వేణుగోపాల నాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టరేట్ల వద్ద సోమవారం ఆందోళనలు తలపెట్టి నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమాల్లో విలేకరు లంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టును చంపుతామనడం దుర్మార్గం
కొల్లి గంగు నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి, పార్వతీపురం

ప్రజాశక్తి విలేకరి ఎం.రామారావుని టిడిపి మక్కువ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు చంపుతానని బెదిరించి దాడి చేయడం దుర్మార్గం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మన్యం జిల్లాలో ఇంతవరకు ఇలాంటి సాంప్రదాయం కనిపించలేదు. గతంలో ఈ ప్రాంతం నుంచి హేమాహేమీలైన నాయకులు మంత్రులుగా పని చేశారు. ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు చూడలేదు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అండ చూసుకుని ఆమె ప్రధాన అనుచరుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు విలేఖరి రామారావుపై దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

విలేకరి పై దాడి అమానుషం
మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు : విలేకరి మల్యాడ రామారావు పై టిడిపి నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా పరిగణించే మీడియా సంస్థల ప్రతినిధులపై దాడి చేయడం అమానుషం. ఇలాంటి చర్యలు పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. పత్రికా విలేకరులు అనేక కోణాల్లో వారికి తెలిసిన విషయాలను వార్తలు గా రాస్తారు. వాటిలో ఎవరికైనా నొప్పించే విషయం వుంటే తగిన రీతిలో ప్రశ్నించాలి, లేదా ఫిర్యాదు చేయాలి. కానీ భౌతిక దాడికి పాల్పడడం దారుణమైన చర్య. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టు కుటుంబానికి రక్షణ కల్పించాలి.

అవకాశమిస్తే అండగా ఉంటా...

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతు వినిపించి వారికి అండగా ఉంటానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం నగరం, ఆమదాలవలసలోని పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసి, ప్రస్తుతం అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పని చేశారని గుర్తు చేశారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచానని గుర్తుచేశారు. తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకులు గొంతుకునవుతానన్నారు. తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో మాణిక్యం విద్యాసాగర్

20 బంగారు, 18 వెండి, 10 కాంస్య పతకాలు సొంతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



సాధించిన పతకాలను చూపుతున్న విద్యాసాగర్

మండలంలోని లోవముతా ప్రాంతం దుడ్డుఖల్లు పంచాయతీ దొంగరికిక్కువ గ్రామానికి చెందిన ఆదివాసీ బిడ్డ మన్యంలో మాణిక్యం పువ్వల.విద్యాసాగర్. అతని తల్లిదండ్రులు పువ్వల.ధర్మారావు (ఉపాధ్యాయులు), తల్లి పువ్వల పద్మావతి. 2012 నుంచి చదువుతోపాటు కరాటే క్రీడ పట్ల విద్యాసాగర్‌కు ఎంతో ఆసక్తి ఉండేది. కరాటే కోచ్ మండంగి పురుషోత్తం ఆధ్వర్యంలో కరాటే నేర్చు కోవడం మొదలుపెట్టాడు. విద్యాసాగర్ కృషి, పట్టుదలతో ఏడాది తిరగకుండానే మొట్టమొదటిసారి విశాఖపట్నంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియనిషిప్ టోర్నమెంట్‌లో అండర్ -14 విభాగంలో ద్వితీయ స్థానంలో వెండి పతకం సాధించాడు. అలాగే 2014లో బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో ఫస్ట్ డాన్ ఉత్తీర్ణుడయ్యాడు. అలాగే హిమాచల్‌ప్రదేశ్‌లోని భైద్యనాథ్‌పండల్‌లో జరిగిన 2014 జనవరి 14,15 తేదీలలో యూనివర్సల్ షోటోఖాన్ కరాటే డు ఇండియా, అసోసియేషన్ ఆధ్వర్యంలో 40 - 45 బరువు విభాగంలో తలబడి స్వర్ణ సాధించాడు. అదే ఏడాది సంకాయ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 40 - 45 విభాగంలో కూడా స్వర్ణ పతకం సాధించాడు. అలాగే లక్ష రూపాయల నగదు బహుమతిని కూడా దక్కించుకున్నాడు. పంజాబ్‌లో జరిగే స్టూడెంట్స్ ఒలింపిక్స్ నేషనల్ గేమ్స్ 36 - 40 విభాగంలో మళ్లీ స్వర్ణ పతకం సాధించి సత్తా చాటాడు. ఈ ఏడాది జనవరి లో 1, 2 తేదీల్లో జరిగిన విశాఖపట్నం ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్‌లో స్వర్ణ పతకం సాధించాడు.


విద్యాసాగర్ 2012 సంవత్సరం నుంచి 2025 వరకు కరాటేలో పతకాల పంట కురిపిస్తూనే ఉన్నాడు. ఇప్పటి వరకు విద్యాసాగర్ 20 బంగారు, 18 వెండి, 10 రజిత పథకాలు సాధించాడు. ఈ మేరకు పువ్వల విద్యాసాగర్ విజయాలను గుర్తించిన జట్టు వ్యవస్థాపకులు పారినాయుడు మాస్టారు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 2015లో సన్మానించారు.

ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కరాటేలో తనకు మంచి నైపుణ్యం ఉన్నా సరైన ప్రోత్సహం లేనందున ముందుకు రాణించలేకపోతున్నానని అన్నాడు. కావున సంబంధిత అధికారులు తన ప్రతిభను గుర్తించి ఇంకా మరెన్నో పతకాలు సాధించడానికి సహకరిస్తారని కోరారు.

ఫైలేరియా నివారణకు విస్తృత చర్యలు

- ఐదు పిహెచ్‌సిల పరిధిలోని 95 గ్రామాల్లో మాత్రలు పంపిణీ
- పకడ్బందీగా మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం
- 'ప్రజాశక్తి'తో ఫైలేరియా నివారణ అధికారి వరప్రసాద్‌రెడ్డి ముఖాముఖి





ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఫైలేరియా నివారణకు విస్తృత చర్యలు చేపడుతున్నామని ఫైలేరియా నివారణ జిల్లా అధికారి జి.వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం కేంద్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ఈ నెల పదో తేది నుంచి మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నప్పటికీ రాష్ట్రంలో, దేశంలో సమాచారాన్ని బట్టి ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎక్కువ కేసులు ఉన్నట్టుగా అర్థం చేసుకోవచ్చని వివరించారు. ప్రస్తుతం బలిజిపేట, గుర్ల మండలాల్లో ఫైలేరియా కేసులు ఎక్కువగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఫైలేరియా నివారణ అధికారి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు....

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రస్తుతం ఫైలేరియా కేసులు ఎన్ని? ఎక్కువగా ఎక్కడ ఉన్నాయి.?

పార్వతీపురం మన్యం జిల్లాలో 333, విజయనగరం జిల్లాలో 82 చొప్పున ఫైలేరియా కేసులు ఉన్నాయి. వీటిలో మన్యం జిల్లాలోని బలిజిపేట మండలంలోనే అత్యధికంగా 307 వరకు ఉన్నాయి. బలిజిపేట మండలం పెదపెంకిలో అత్యధికంగా 192 మంది బోధవ్యాధితో బాధపడుతున్నారు. ఇదే మండలం నారాయణపురంలో 20 మంది, బలిజిపేటలో 11 మంది, చిలకలపల్లిలో 15, అరసాడ పిహెచ్‌సి పరిధిలో 35 మంది, గళావల్లి పిహెచ్‌సి పరిధిలో 30 మంది ఫైలేరియాతో చికిత్స పొందుతున్నారు.

విజయనగరం జిల్లాలో పరిస్థితి ఏమిటి.?

గుర్ల మండలాల్లో 82 ఫైలేరియా కేసులు ఉన్నాయి. ఒక్క గూడెం గ్రామంలోనే 58 వరకు ఉన్నాయి. ఆ గ్రామంలో ఈ ఏడాది కొత్తగా ఐదు కేసులు నమోదయ్యాయి. మొత్తంగా పరిశీలిస్తే విజయనగరం జిల్లాలో గుర్ల, మన్యం జిల్లా బలిజిపేట మండలంలోనే కేసులు ఉన్నాయి.

ఫైలేరియా నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఫైలేరియా బాధితులు ఉన్న గ్రామాలతోపాటు ఆ చుట్టుపక్కల గ్రామాలపై సైతం దృష్టి కేంద్రీకరించి, మందులు పంపిణీ చేస్తున్నాం. రాత్రి పూట రక్తనమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారించడం, పాజిటివ్ కేసులకు జాప్యం లేకుండా మందుల పంపిణీ చేయడం వంటి చర్యలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది.

మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం అంటే ఏమిటి.?

ఫైలేరియా కేసులు పెరుగుతున్న చోట కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం చేపడుతున్నాం. దేశంలో 111 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. మన రాష్ట్రంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో మాత్రమే అమలవుతోంది. ఇక్కడ కేసులు అదుపులోకి రాకపోవడమే ఇందుకు కారణం. ఈ కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నాం.

జిల్లా అంతటా పంపిణీ చేస్తున్నారా.?

లేదు... లేదు... ఫైలేరియా కేసులు నమోదైన గ్రామాలతోపాటు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో మాత్రమే ఈ మాస్ డ్రగ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. ముందుగా చెప్పినట్టు బలిజిపేట మండలం బలిజిపేట, అరసాడ, గళావల్లి, గుర్ల మండలం మండలం గుర్ల, తెట్టంగి పిహెచ్‌సిల పరిధిలోని 95 గ్రామాల్లో రెండేళ్లలోపు గలవారు, గర్భిణులు మినహాయించి మిగిలిన వారందరికీ అక్కడికక్కడే మాత్రలు పంపిణీ చేస్తున్నాం. ఇందులో భాగంగా కొత్త కేసులను గుర్తించేందుకు కూడా ప్రయత్నిస్తున్నాం.

మందుల పంపిణీ ఎంత వరకు వచ్చింది.?

మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు గ్రామ సచివాలయాలు లేదా ముఖ్యకూడళ్ల వద్దకు వచ్చిన వారికి అక్కడికక్కడే మాత్రలు మింగించే పనిచేశాం. 13నుంచి 22 వరకు 10 రోజులపాటు ఇంటింటికీ వెళ్లి మిగిలిన వారందరితో మాత్రలు మింగించే కార్యక్రమం జరుగుతోంది. అప్పటికీ తప్పిపోయిన వారిని గుర్తించి 23 నుంచి మాత్రలు వేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

కరోనాతో కనుమరుగైన సంతలు

పున: ప్రారంభంపై పట్టని అధికారులు

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రంలో గల సీతంపేట సంత మాదిరిగానే దోనుబాయి, పొల్ల సంతలకు మంచి డిమాండ్ ఉండేది. పల్లెలు, పట్టణాల నుంచి నగరాల వరకు వ్యాపారులు ఈ సంతలకు వచ్చేవారు. ప్రతి గురువారం ధోనుబాయి సంత గిరిజనులు, వ్యాపారులు, వర్తకులతో కిటకిటలాడేది. అలాంటిదే ప్రస్తుతం నిర్మానుష్యంగా ఉంది. కరోనా సమయంలో మూతపడిన ధోనుబాయి, పొల్ల సంతలు నేటికీ పున : ప్రారంభానికి నోచుకోలేదు. వీటి పునః ప్రారంభానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడంలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ధోనుబాయిలో పశువైద్యశాల సమీపంలో సంత నిర్వహించేవారు. అలాగే పొల్ల కాలనీలోలో శనివారం సంత నిర్వహించేవారు. సీతంపేట సంత సోమవారం జరుగుతుంది. సీతంపేట సంతలో దొరకని అటవీ ఉత్పత్తులు, ఆ సంతకు రాలేకపోయినా వ్యాపారులు, గిరిజనులు ధోనుభాయి, పొల్ల సంతలకు వచ్చి అటవీ ఉతత్తులను విక్రయించేవారు. గిరిజనులు నిత్యవసర సరుకులు కొనుక్కొని గ్రామాలకు తిరిగి వెళ్లేవారు. అలాంటి సంతలు కరోణనా దెబ్బతో మూతపడింది. మరల సంత ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నప్పటికీ సంబంధించిన అధికారులు మాత్రం వెనకడుగు వేస్తున్నారు.

ధోనుబాయి పొల్ల సంతలు పరిధిలో ధోనుబాయి, కిల్లాడ, ధారపాడు, పెద్దపల్లి, టిటికుపాయి, సామరెల్లి, అంటికొండ, పుబ్బాడ, కిల్లాడ, కె.వీరగొట్టం, దుగ్గి, మానాపురం తదితర సుమారు 20 పంచాయతీల వరకు ఈ సంతలు పరిధిలో ఉన్నాయి. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులు ధోనుబాయి, పొల్ల సంతలకు తీసుకొచ్చి ఏ పంట ఏ సీజన్లో పండితే ఆ పంటను సంతకు తీసుకొచ్చేవారు. అక్కడ విక్రయించి వారికి కావాల్సిన నిత్యవసర సరుకులు కొనుగోలు చేసుకునేవారు. అయితే ఈ సంత గత కరోనా దెబ్బతో ఐదేళ్లుగా ఆగిపోవడంతో గిరిజనులు అటవీ ఉత్పత్తులు సీతంపేట సంతకు తీసుకురావాల్సిన పరిస్థితి దాపురించింది. సుమారు ఒక్కొక్క పంచాయతీకి ఒక్కొక్క గ్రామానికి 15 కిలోమీటర్ల నుంచి 20 కిలోమీటర్ల వరకు సీతంపేట సంత దూరాన ఉంటుంది. దీంతో గిరిజనులు తెచ్చిన అటవీ ఉత్పత్తులు రవాణాకే సరిపోతుంది కొన్ని సందర్భాల్లో మార్కెట్ ధర లేకపోతే తిరిగి ఇంటికి తీసుకొని వెళ్లలేక ఎంతకో కొంతకి వ్యాపారులకు ఇచ్చేయవల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో అధికారులకు కూడా సంతలు ఏర్పాటు చేయాలని వినతులు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదు.



దోనుబాయి గ్రామ ముఖచిత్రం



పిచ్చిమొక్కలతో నిండిపోయిన సంత ప్రదేశం

గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు

ధోనుబాయి, పొల్ల సంతలు నిర్వహించకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యవసర సరుకులు, అటవీ ఉత్పత్తులు విక్రయించడానికి, నిత్యవసర సరుకులు కొనుగోలు చేయడానికి సంత లేదు. గతంలో సంతకు వెళ్లాలంటే సీతంపేట సంతకు సుమారు 15 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సంతను తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని గత ఐటిడిఎ పిఒ నవ్యకు వినతి పత్రం సమర్పించాం.

కూరంగి వెంకి నాయుడు,
సర్పంచ్, ధోనుబాయి.

దోనుబాయి, పొల్ల గ్రామపంచాయతీ నుంచి తీర్మానం రావాలి

ధోనుబాయి, పొల్ల గ్రామ పంచాయతీల నుంచి తీర్మానం చేసి మా కార్యాలయానికి వస్తే ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తాం. జిల్లా అధికారుల నుంచి నోటిఫికేషన్ వస్తే సంతలు నిర్వహిస్తాం.

కొండపల్లి సత్యం
మండల విస్తరణ అధికారి, సీతంపేట .

పొల్ల సంత అవసరం

పొల్లసంత పొల్ల కాలనీలో జరిగేది. సంత జరగకపోవడంతో అటవీ ఉత్పత్తులు దళారులకు అమ్మాల్సిన పరిస్థితి వచ్చింది. సంతలోనే ఇంటికి కావాల్సిన సామాగ్రి దొరికేది. ప్రస్తుతం సంత లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే సంతను పున: ప్రారంభించాలి.

బిడ్డక ఆదినారాయణ,
ఎంపిపి, సీతంపేట.



నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

పెద్దగెడ్డ నిర్వాసితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

పెద్దగెడ్డ జలాశయంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఇప్పటికే ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులకు ప్రభుత్వం రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి మంజూరు చేసి తమను అన్ని విధాలా ఆదుకోవాలని కేసలి నిర్వాసిత గ్రామం వద్ద బాధితులు ఆదివారం నిరసన తెలిపారు. నిర్వాసితులైన మీసాల మోహనరావు, ఎస్.పాపారావు, సర్పంచ్ ప్రతినిధి సత్తారపు రాము ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో పెద్దగడ్డ జలాశయం నిర్వాసితుల సంఘం నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడారు. ఆర్ఆర్ ప్యాకేజీ పేర్లను ప్రకటించినా నేటికీ డబ్బులు మంజూరు కేసలి, కోటికిపెంటలో గల నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మిగతా నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇల్లు గ్రాంట్ కోసం రూ.5లక్షలు చొప్పున మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన ఇంటి నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ పెట్టి నిర్మించాలని కోరారు. సర్వం కోల్పోయి ఎన్నో ఇబ్బందులుపడుతున్న నిర్వాసిత గ్రామాల్లో బతకడానికి అవకాశం లేక వలసలుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మంత్రి సంధ్యారాణిని, కలెక్టర్‌ను కోరారు.

వాటర్ ట్యాంకు క్లీనింగ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం



మండలంలోని సూరంపేట, గుచ్చిమిలో వాటర్ ట్యాంకులను క్లీనింగ్ పనులను ఆదివారం ఇఒపిఆర్డి కెకె కుమారవర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వాటర్ ట్యాంకులు క్లీన్ చేసి నీటిలో బ్లీచింగ్ జల్లి కుళాయిల ద్వారా మంచినీరందించాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని, గ్రామాన్ని స్వచ్ఛతగా ఉంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.మురళీకృష్ణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.



పొంగమంచుతో కప్పకుపోయిన విశాఖ- పార్వతీపురం రహదారి

ఉదయం పొగ మంచు.. మధ్యాహ్నం ఎండ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో ఆదివారం తెల్లవారుజాము నుండి ఉదయం 9 గంటల వరకు పొగ మంచు భారీగా కురవడంతో స్థానికులు ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేసవి రాక ముందే ఫిబ్రవరి రెండో వారంలోనే ఎండలు అధికంగా ఉన్నాయి. అయితే వాతావరణంలో జరుగుతున్న మార్పులు కారణంగా ఉదయం నుంచి కురుస్తున్న పొగ మంచు, ఉదయం 11 గంటలకు నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడం విశేషం. పొగ మంచు కారణంగా ఉదయాన్నే వాకింగ్ కోసం నివాస గహాల నుండి బయటకు వచ్చే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జిల్లా కేంద్రానికి వివిధ పనులపై పరిసర గ్రామాల నుంచి వచ్చే వాహన చోదకులు, కూరగాయల వ్యాపారులు తమ వాహనాల లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఫిబ్రవరిలోనే వాతావరణ పరిస్థితి ఈ విధంగా ఉంటే రానున్న మార్చి, ఏప్రిల్, మేనెలల్లో ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

స్టార్ వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నికైంది. ఈ వాకర్స్ క్లబ్ మూడో వార్షికోత్సవానికి వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిస్టిక్ పాస్ట్ గవర్నర్ నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిక జీవితంలో అన్ని వయసుల వారు మానసిక ఒత్తిళ్లకు గురై అనారోగ్యం పాలవుతున్నారని, ప్రతి ఒక్కరూ నడుస్తూ ఇంకొకరిని నడిపించాలని సూచించారు. అనంతరం జరిగిన మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షులుగా పిల్లా సత్యనారాయణ, కార్యదర్శిగా ఎం.మహీపతి, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, ఉప కార్యదర్శిగా పి.మార్కండేయులు, కోశాధికారిగా ఎం.శ్రీధర్, గౌరవ అధ్యక్షులుగా జివిఆర్ఎస్ కిషోర్, పట్టా చిన్నం నాయుడు, సలహాదారులుగా ఎం.రవికుమార్, చిన్నారావు, కె.నాగులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభ్యులను మాజీ పాస్ట్ గవర్నర్ ఇందుపూరు గున్నేష్ సత్కరించారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు సండే సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జెయింట్ వీల్ ఎక్కి ఆకాశంలో ఉయ్యాల జంపాల ఊరేగారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. చిన్నారులు మినీ బోటింగ్ చేశారు. 5డి థియేటర్ వీక్షించారు. ఆనంద విహార్ వద్ద డాన్సులు వేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు.

జనసేన మండల అధ్యక్షులుగా శివ

గరుగుబిల్లి :మండల జనసేన అధ్యక్షులుగా రావుపల్లికి చెందిన బోను శివ, ఉపాధ్యక్షులుగా చిన్నగొడబకు అక్కినేని శంకరరావును నియమిస్తూ జనసేన కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కద్రక మల్లేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్బంగా అధ్యక్షులు శివ మాట్లాడుతూ నా పైన నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతలను పూర్తిస్థాయిలో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాగూరుకు చెందిన కేతిరెడ్డి అశోక్ కుమార్, జనసేన రాష్ట్ర లీగల్ సెల్ నెంబర్, శివ్వాం గ్రామానికి చెందిన వెంకటనాయుడు, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సాంఘిక సంక్షేమ వసతిగృహం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వందలాది మంది పేద విద్యార్థులకు వసతిని కల్పించిన హాస్టల్ భవనం నేడు ప్రమాదకర పరిస్థితిలో ఉంది. మండలంలోని రావివలస పంచాయతీలో 1979న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం నిర్మించారు. ఈ భవనం కాలం చెల్లినప్పటికీ వేరొక అవకాశం లేక విద్యార్థులను ఇదే భవనంలో వసతిని ఏర్పాటు చేయడం వల్ల ఎప్పుడు ఏమవుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే శిథిలావస్థలో ఉన్న వసతిగృహం ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెచ్చులూడుతూ విద్యార్థులపై పడుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ వసతి గృహంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 35మంది విద్యార్థుల్లో ఏ విద్యార్థికి ఎప్పుడు ఏమవుతుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న బాలుర వసతి గృహం

అధికారులు దృష్టిలో ఉంది

వసతి గృహం పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడం జరిగింది. ప్రభుత్వం నూతన వసతి గహం మంజూరు చేస్తే మంచింది.

ధర్మారావు,
వసతి గహ వార్డెన్.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం..

మారుతున్న ప్రభుత్వాలు విద్యార్థుల వసతి గృహాలపై దృష్టి సారించడం లేదు. అయినా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఏమైనా జరగరాని సంఘటన ఏమైనా జరిగితే పాలకులు, అధికారులు మొసలి కన్నీళ్లు కార్చడం తప్ప ఏమీలేదు. శిథిలావస్థలో ఉన్న భవనం తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలి. విద్యార్థులకు ప్రమాదం వాటిల్లితే అధికారులు, ప్రజాప్రతినిధుల బాధ్యత వహించాలి.

కె. గంగునాయుడు
సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి

రోడ్డు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గుమడ వద్ద అంతరాష్ట్ర రహదారిపైన ప్రమాద నివారణ చర్యలకు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి మార్గంలో గుమడ వద్ద వాహనాలు అతి వేగంగా వెళ్తున్న సందర్భంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో గుమడకు చెందిన భాస్కరరావు లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందాడన్నారు. ఆ సమయంలో ప్రమాదాలు నివారించాలని కోరుతూ గుమడ గ్రామస్తులంతా రోడ్డుపై భాస్కరరావు మృతి దేహంతో నిరసన తెలిపారన్నారు ఆ సమయంలో పోలీసులు, రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు వచ్చి ఇక్కడ భవిష్యత్తులో ప్రమాదం జరగకుండా ప్రమాద నివారణ చర్యలు చేపడతామని చెప్పినప్పుడు కూడా ఆ దిశగా అధికారులు నేటికీ ఒక్క అడుగు చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుమడ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

చికెన్ ప్రియులను వెంటాడిన బర్డ్‌ఫ్లూ భయం

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ జిల్లాలో చికెన్ విక్రయాలపై భారీగానే పడింది. జిల్లాలో ఆదివారం కోళ్ల విక్రయాలు పది శాతం కూడా కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూతో కోళ్లు మరణిస్తుండటం, అది సోకిన కోళ్లను తిన్నవారికీ వ్యాపిస్తుందనే ప్రచారంతో చికెన్ విక్రయాలు దారుణంగా మందగించాయి. ఆదివారమైతే ముక్కలేనిదే ముద్ద దిగని వారు సైతం చికెన్‌ను పక్కన పెట్టిన పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా చేపలు, మటన్ వ్యాపారులు ధరలు పెంచేశారు.



- భారీగా పడిపోయిన కోళ్ల అమ్మకాలు
- ఆవేదన చెందుతున్న పౌల్ట్రీ, చికెన్ వ్యాపారులు
- పెరిగిన చేపలు, మటన్ విక్రయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలో బర్డ్ ఫ్లూ భయంతో ఆదివారం చికెన్ అమ్మకాలు అమాంతంగా పడిపోయాయి. ఉభయగోదావరి జిల్లాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి, కోళ్లు చనిపోవడంతోపాటు చికెన్ తిన్నవారికి కూడా బర్డ్ ఫ్లూ సోకుతుందని ప్రచారం జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో చికెన్ షాపులు ఆదివారం వెలవెలబోయాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే లక్ష నుంచి లక్షా 20 వేల కిలోల వరకు చికెన్ విక్రయాలు జరుగుతుంటాయి. మిగిలిన రోజుల్లో రోజుకు 40 వేల కిలోల వరకు చికెన్ విక్రయిస్తుంటారు. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో ఆదివారం 8 వేల కిలోల వరకు మాత్రమే అమ్మకాలు జరగ్గా, మిగిలిన రోజుల్లో పూర్తిగా విక్రయాలు లేవని పౌల్ట్రీ, చికెన్ వ్యాపారులు చెబుతున్నారు. ధర తగ్గించి విక్రయించినా చికెన్ ప్రియులు కొనుగోలుకు ముందుకు రాలేదు.



బొబ్బిలిలో బోసిపోయిన కోళ్ల ఫారాలు

బొబ్బిలి పట్టణంలో ఆదివారం కోళ్లఫారాలు, చికెన్ షాపులు బోసిపోయాయి. పట్టణంలో సుమారు 30 వరకు కోళ్ల ఫారాలు పెట్టుకుని నిరుద్యోగ యువకులు ఉపాధి పొందుతున్నారు. పట్టణంలో బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌కు ముందు ఆదివారం ఒక్కరోజే 5వేల కిలోల చికెన్ అమ్మకాలు జరిగేవి. సాధారణ రోజుల్లో 2 వేల కిలోల వరకు అమ్మకాలు సాగేవి. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో పట్టణంలో ఆదివారం 500 కిలోల కూడా అమ్మకాలు జరగలేదని వ్యాపారులు చెబుతున్నారు. చికెన్ అమ్మకాలు పడిపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోళ్ల ఫారాలలో పని చేసే కార్మికులకు కూలి డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

పెంపకందారులంతా నిరుద్యోగులు, సాధారణ రైతులే

జిల్లాలో పౌల్ట్రీ పెంపకందారులంతా నిరుద్యోగులు, సాధారణ రైతులే. చదువుకుని ఉద్యోగాలు లేకపోవడంతో చాలామంది యువత బ్యాంకుల్లో రుణాలు, ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి బ్రాయిలర్ కోళ్ల పెంపకం కేంద్రాలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. బర్డ్ ఫ్లూ ప్రభావంతో కోళ్ల అమ్మకాలు తగ్గిపోవడంతో పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పెంపకందారులను ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

పెరిగిన మటన్ ధర

బర్డ్ ఫ్లూ భయంతో జిల్లాలో చికెన్ విక్రయాలు పడిపోయాయి. మాంసం ప్రియుల దృష్టి మటన్, చేపలు, రొయ్యల వైపు మళ్లింది. ఇదే అదునుగా మటన్, చేపల వ్యాపారులు వాటి ధరలను అమాంతంగా పెంచేశారు. రూ.800 వరకు ఉండే కిలో మటన్ ధర.. ఆదివారం రూ.వెయ్యికి పెంచారు. కిలో రూ.120 నుంచి 150 వరకు ఉండే చేపల ధరలు.. రూ.200 వరకు చేరాయి.

కూలీలకు డబ్బులివ్వలేకపోతున్నాం



చికెన్ అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. మన జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేకపోయినా, అధిక ప్రచారంతో జనం కొనుగోలుకు ముందుకురావడం లేదు. దీంతో కోళ్లఫారం వ్యాపారం తీవ్రంగా దెబ్బతింది. అమ్మకాలు తగ్గిపోవడంతో కోళ్ల ఫారంలో పని చేసే వారికి కూలి డబ్బులు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

- మురహరి రాధాకృష్ణ,
కోళ్లఫాం వ్యాపారి



హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రాక

ప్రజాశక్తి -విజయనగరంలీగల్

నగరంలో ఒక కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ చీమలపాటి రవి.. జిల్లాకు వచ్చారు. స్థానిక జిల్లా పరిషత్తు అతిథి గృహానికి విచ్చేసిన ఆయనకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ సాదర స్వాగతం పలికారు. జిల్లా కోర్టుకు చెందిన పలువురు న్యాయాధికారులు కూడా న్యాయమూర్తిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి.. జిల్లా జడ్జి, కలెక్టర్, ఇతర న్యాయాధికారులతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఆప్కోస్‌ను కొనసాగించాల్సిందే

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- మార్చి 10న కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి కార్పొరేషన్ ఆఫ్ అవుట్‌సోర్సెడ్ సర్వీసెస్ (ఆప్కోస్)ను కొనసాగించాల్సిందేనని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్‌చేశారు. ఎపి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు ఎస్.అప్పలరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం మేరకు ప్రభుత్వం ఆప్కోస్‌ను రద్దు చేసే యోచనలో ఉందని పత్రికల్లో కథనాలు వస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తు అవుట్ సోర్సింగ్ నియామకాలు ప్రయివేటు ఏజెన్సీల ద్వారా చేపట్టాలనే ఆలోచనను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వమే నేరుగా నియామకాలు చేపట్టాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని కోరారు. మినిమం టైమ్ స్కేల్ అమలు చేసి దశలవారీగా వారిని రెగ్యులరైజేషన్ చేయాలని, అప్పటివరకు అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ కొనసాగించాలని డిమాండ్‌చేశారు.

ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి వాగ్దానం చేసినా, 8 నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలూ కనిపించడం లేదన్నారు. ప్రభుత్వ సేవల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, కనీస స్థాయిలోనైనా సంక్షేమ పథకాలు అందకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించేలా సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్లపై సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మార్చి పదో తేదిన కలెక్టరేట్ వద్ద ధర్నాకు రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది.

ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డి.సాయిప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, జెఎసి నాయకులు డి.జగన్మోహన్, కె.శ్రీనివాస్, ఎ.రాజేష్, రాజేష్, ఈశ్వరరావు, పి.దుర్గారావు, బి.శ్రీనివాసరావు, వి.రమేష్, మజ్జి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.